సాక్షి అనకాపల్లి

శనివారం । 13 । ఏప్రిల్ । 2024



వైద్య పరికరాల వితరణ

విశాఖ: కేజీహెచ్ పీడియాట్రిక్స్ విభాగం పూర్వ విద్యార్థులు రూ.4 లక్షల విలువైన నియోనాటల్ సర్జికల్ వస్తువులు అందించారు.



వెంకన్నకు క్షీరాభిషేకం

పెందుర్తి : వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సుప్రభాత సేవ అనంతరం విశేష క్షీరాభిషేకం చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.8/23.0

వాతావరణం

తేలికపాటి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

12 అడుగుల గిరినాగు పట్టివేత



మాడుగుల రూరల్: మాడుగుల మోదకొండమ్మ ఆలయం సమీపంలో తుమ్మగంటి వారి పంట పొలాల వద్ద 12 అడుగుల గిరినాగును పట్టుకున్నారు. శుక్రవారం గిరినాగును చూసి బెంబేలెత్తిన స్థానికులు మాడుగుల మోదమాంబ కాలనీకి చెందిన స్నేక్ కేచర్ పెచ్చెట్టి వెంకటేశ్‌కు సమాచారమిచ్చారు. ఆయన చాకచక్యంగా పామును పట్టుకొని మాడుగుల శివారు రామచంద్రపురం గ్రామంలో గల అడవుల్లో వదిలిపెట్టారు. గిరినాగు వల్ల ఎటువంటి హాని కలగదని ప్రజలకు వివరించారు.

అన్యాయంగా టీడీపీ, జనసేన ఆరోపణలు

అనకాపల్లి: డబుల్ ఎంట్రీ, మృతుల ఓట్లపై లేనిపోని అభియోగాలతో టీడీపీ, జనసేన నేతలు అన్యాయంగా ఆరోపణలు చేస్తున్నారని, ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా ఇన్‌చార్జి కొణతాల హరినాథ్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం ఓటర్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎక్కడా అవినీతికి తావులేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోందని ఆయన తెలిపారు. ఈవీఎంల వెరిఫికేషన్ నుంచి ఓటర్ల లిస్టు వరకు అన్ని రాజకీయ పార్టీల ప్రధాన నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎనిమిది నెలలుగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అయినప్పటికీ ఓటమి భయంతో టీడీపీ, జనసేన నాయకులు ప్రజలను మభ్యపెట్టడంతో పాటు అధికార యంత్రాంగంపై బురద జల్లే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

విశాఖ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికార్లకు ప్రశంసాపత్రాలు

తుమ్మపాల: గడిచిన సంక్రాంతి పండగలో రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లా అత్యధిక ఆదాయం సాధించిందని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. శుక్రవారం ఆయన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్‌తో కలిసి పట్టణంలో డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి కె.పద్మావతితోపాటు సూపర్‌వైజర్లను అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో బి.అప్పలనాయుడు, ఆఫీస్ సిబ్బంది, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, గ్యారేజ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

106 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం

సీతమ్మధార: అక్కయ్యపాలెం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఖాళీ చేస్తున్నామని, లాకర్‌లో ఉన్న బంగారు నగలు తీసుకువెళ్లాలని వినియోగదారుడు నాగిరెడ్డికి బ్యాంకు అధికారులు ఫోన్ చేసి చెప్పడంతో..ఆయన బ్యాంకు లాకర్‌లో ఉన్న సుమారు 106 తులాలు బంగారు నగలు తీసుకుని కారులో మురళీనగర్ వెళుతుండగా.. అధికారులు వాహన తనిఖీ నిర్వహించారు. స్టాటిక్ సేవలర్ టీం -3 ,అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పద్మవతి తనిఖీలు చేస్తుండగా కారులో 106 తులాల బంగారు ఆభరణాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలోని అధికారులకు వీటిని అప్పగించారు. బంగారు నగలకు సంబంధించిన బ్యాంకు అధికారులు రాతపూర్వకంగా ఇచ్చినప్పటికీ నిబంధలు ప్రకారం ఆర్‌వోకు అప్పజెప్పడం మా బాధ్యత అని అధికారులు తెలిపారు. బంగారు నగలను ట్రెజరీలో భద్రపరుస్తున్నట్లు సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్ జి.శ్రీరామూర్తి తెలిపారు.

ఇంటర్‌లో మెరిసిన బాలికలు

- ఫస్టియర్‌లో 52 శాతం, సెకండియర్‌లో 66 శాతం ఉత్తీర్ణత
- ఈ నెల 24 వరకు రీ వెరిఫికేషన్‌కు అవకాశం

సాక్షి, అనకాపల్లి: ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల్లో జిల్లాలో బాలికలు సత్తా చాటారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 56 కళాశాలలకు చెందిన 19,691 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 11,561 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 52 శాతం, ద్వితీయ సంవత్సరంలో 66 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొదటి సంవత్సరం పరీక్షలకు 10,443 మంది హాజరుకాగా, 5,442 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం పరీక్షలకు 9,248 మంది హాజరుకాగా 6,119 మంది ఉత్తీర్ణులయ్యారు.

రెండింటిలోనూ బాలికలే ..

ఫలితాల్లో బాలురు కంటే బాలికలదే పైచేయిగా నిలిచింది. మొదటి సంవత్సరంలో 4,381 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా..1,729 మంది పాసై 39 శాతం ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా 6,062 మంది బాలికలు పరీక్షకు హాజరవగా 3,703 మంది పాసై, 61శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో 3,756 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 2112 మంది పాసై 56 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 5,492 మంది పరీక్షకు హాజరవగా 4,007 మంది పాసై, 73 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కేజీబీవీలో ..

కేజీబీవీలో ప్రథమ సంవత్సరంలో 73 శాతం, ద్వితీయ సంవత్సరంలో 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 619 మంది హాజరు కాగా 452 మంది, ద్వితీయ సంవత్సరంలో 467 మంది పరీక్షలకు హాజరుకాగా 388 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కశింకోట కేజీబీవీ 100 శాతం, ఇంటర్ సెకండ్ ఇయర్‌లో గొలుగొండ, కోటవురట్ల కేజీబీవీలు 100 శాతం ఉత్తీర్ణతసాధించాయి. కశింకోట మండలం తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షల్లో 95.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. 66 మంది పరీక్షలు రాయగా, 63 మంది ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ జి.గ్రేస్ శుక్రవారం తెలిపారు. మొదటి సంవత్సరంలో 53 మంది పరీక్షలకు హాజరు కాగా, 49 మంది ఉత్తీర్ణులయ్యారని, 92.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు.

హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో

అనకాపల్లి జిల్లాలో నాలుగు హైస్కూల్ ప్లస్ పాఠశాలలున్నాయి. జెడ్పీహెచ్ఎస్ కూండ్రం, పరవాడ, పాయకరావుపేట, యలమంచిలిలో గల పాఠశాలల్లో మొదటి సంవత్సరం 109 మంది పరీక్షలకు హాజరుకాగా..27 మంది ఉత్తీర్ణులయ్యారు.



ద్వితీయ సంవత్సరం 65 మంది పరీక్షలకు హాజరు కాగా..29 మంది ఉత్తీర్ణులయ్యారు.

రీ–వెరిఫికేషన్‌కు అవకాశం

ఫలితాల్లో విద్యార్థులకు ఏమైనా అనుమానాలు ఉంటే వాటిని నివృత్తి చేసేందుకు రీ–వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు అవకాశం కల్పించినట్టు ఆర్ఐవో పి.మురళీధర్ తెలిపారు. రీ కౌంటింగ్‌కు ఒక్కో పేపరుకు రూ.260, రీ– వెరిఫికేషన్‌కు ఒక్కో పేపరుకు రూ.1,300 చెల్లించి విద్యార్థులు చదివిన కాలేజీల ద్వారా ఈ నెల 24లోగా ఇంటర్మీడియెట్ బోర్డుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఏపీ మోడల్ స్కూళ్లు

అనకాపల్లి జిల్లాలో ఐదు ఏపీ మోడల్ స్కూళ్లకు గాను చీడికాడలో ఫస్ట్ ఇయర్‌లో 70.91 శాతం, సెకండ్ ఇయర్‌లో 61.9 శాతం, వేములపూడిలో వరుసగా 80.3, 78.65, రావికమతం మండలం మారుపాకలో 69.01, 89.11, మునగపాక మండలం పాటిపల్లిలో 69.01, 87.84, కశింకోట మండలం తేగాడలో మొదటి సంత్సరంలో 84.81శాతం, రెండో సంవత్సరం 81.01శాతం ఉత్తీర్ణ సాధించారు. మొదటి సంవత్సరంలో అత్యధికంగా ఎంపీసీలో 461, బైపీసీలో 426 మార్కులురాగా..సెకండ్ ఇయర్‌లో అత్యధికంగా ఎంపీసీలో 961, బైపీసీలో 959 మార్కులు వచ్చాయి.

ఈవీఎంలు, వి.వి.ప్యాడ్‌ల ర్యాండమైజేషన్ పూర్తి



రాజకీయ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాడ్‌ల మొదటి ర్యాండమైజేషన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ, రాష్ట్రస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ శుక్రవారం పూర్తయింది. వాటి వివరాలను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించినట్టు కలెక్టర్ తెలిపారు. కేటాయించిన వీవీ ప్యాడ్‌లను స్కానింగ్ చేసి తగిన భద్రతతో అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కేంద్రాలలో గల స్ట్రాంగ్ రూములకు తరలించినట్టు చెప్పారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో, జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో బి.దయానిధి, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు ఎ.చిన్నికృష్ణ, హెచ్.వి.జయరాం, కె.గీతాంజలి, జి.వి.సత్యవాణి, కె.మనోరమ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బయ్యవరం హైవే వద్ద అదుపు తప్పిన ప్రైవేట్ కళాశాల వాహనం
- రోడ్డు పక్క మొబైల్ క్యాంటీన్‌ను ఢీకొనడంతో 11మందికి గాయాలు
- అక్కడికక్కడే బాలుడు మృత్యువాత.. తల్లికి తీవ్ర గాయాలు
- ప్రమాదంలో చిక్కుకున్న పెందుర్తికి చెందిన ముస్లిం కుటుంబం



బయ్యవరం వద్ద రోడ్డు ప్రమాదంలో మొబైల్ క్యాంటీన్ వాహనాన్ని ఢీకొన్న ప్రైవేట్ కళాశాల బస్సు (ఇన్‌సెట్) ప్రమాదంలో మృతి చెందిన షేక్ గౌస్

కశింకోట: అదుపు తప్పి మొబైల్ క్యాంటీన్ మీదకు దూసుకొచ్చిన ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల బస్సు బీభత్సం సృష్టించింది. ఆ సమయానికి అక్కడున్న పదకొండుమంది గాయపడగా అందులో 12 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కశింకోట మండలం బయ్యవరం జాతీయ రహదారి వద్ద శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. సీఐ ఎం.వినోద్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. పెందుర్తి రెల్లికాలనీకి చెందిన షేక్ రెహమాన్ తన మేనల్లుని వివాహం పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి కారులో పిఠాపురంలోని బంధువుల వద్దకు బయలుదేరారు. కశింకోట మండలం బయ్యవరం వద్ద ఆగి మొబైల్ క్యాంటీన్ దగ్గర టిఫిన్ చేస్తుండగా.. అనకాపల్లి నుంచి మాకవరపాలెం వైపు విద్యార్థులతో వెళుతున్న ప్రైవేటు కళాశాల బస్సు దూసుకొచ్చింది. పక్కగా వెళుతున్న కారును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి కొత్తపల్లి రోడ్డు వైపు వేగంగా దూసుకుపోయి పక్కనున్న మొబైల్ టిఫిన్ వాహనాన్ని ఢీకొంది. ఈ దుర్ఘటనలో షేక్ రెహమాన్ కుమారుడు షేక్ గౌస్ (12) అక్కడికక్కడే మృతి చెందాడు. రెహమాన్‌తోపాటు భార్య షేక్ ఉన్నిసా బేగం వారి కుమార్తె షబ్బీర్ యాసిన్, మేనల్లుడు షేక్ అలీ హుస్సేన్, బంధువు సయ్యద్ బాబ్జీ, టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలు గొన్నాబత్తుల లక్ష్మి, టిఫిన్ చేస్తున్న స్థానికులు కరణం లక్ష్మణరావు, గొల్లవిల్లి రమణమ్మ, అనిల్‌కుమార్, రామకృష్ణ గాయపడ్డారు. వీరిని హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి, ఉషా ప్రైమ్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో రెహమాన్ భార్యకు పక్కటెముకులకు, తలకు బలమైన గాయమై విషమంగా ఉండడంతో విశాఖ డెయిరీ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారు అనకాపల్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. షేక్ అలీ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం జరిపించినట్లు సీఐ తెలిపారు. ప్రమాదంలో నాలుగు మోటారు సైకిళ్లు, క్షతగాత్రుల కారు, టిఫిన్ సెంటర్ వాహనం దెబ్బతిన్నాయి. ప్రమాదానికి కారణమైన కళాశాల బస్సును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



క్షతగాత్రులు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

క్షతగాత్రులకు పరామర్శ

అనకాపల్లి: కశింకోట మండలం బయ్యవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శుక్రవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పరామర్శించారు.

విత్తు కొంటున్న కొత్త ఆశలు



ఒంటికన్ను ముచ్చు తయారు చేసేందుకు సిద్ధం చేసిన విత్తనం



రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా స్ట్రేలో ఉంచిన ఒంటికన్ను ముచ్చు

- పాత వంగడాలకు స్వస్తి
- చెరకులో 'శ్రీ సాగు'పై పెరుగుతున్న ఆసక్తి
- 40 లక్షల ఒంటికన్ను ముచ్చులను సబ్సిడీపై ఇస్తున్న గోవాడ ఫ్యాక్టరీ

చోడవరం: తగ్గుతున్న భూ సారం, వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, కాలుష్యం తదితర కారణాలతో చెరకు దిగుబడి రానురానూ తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్లో కుదేలవుతున్న రైతులకు చెరకు పరిశోధన కేంద్రాలు, సుగర్ ఫ్యాక్టరీ అండగా నిలుస్తూ వారిలో అవగాహన కల్పిస్తున్నాయి. కొత్త వంగడాలు, శ్రీసాగు పద్ధతిపై సదస్సులు నిర్వహిస్తూ ఆ దిశగా వారిని సమాయత్తం చేస్తున్నాయి. దీంతో చెరకు రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కొత్త వంగడాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై చెరకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాధారణ పద్ధతిలో వేసే తోటలు తుపాన్ల సమయంలో నేలవాలుతుండడంతో ఆ పరిస్థితులను తట్టుకునే శ్రీసాగు విధానంపై మక్కువ చూపుతున్నారు. దీంతో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ తనవంతు సాయంగా ఒంటికన్ను విత్తనాన్ని అందించేందుకు కొత్తవంగడాలకు సిద్ధం చేసింది.

విస్తృతంగా సదస్సులు

జిల్లాలో సాధారణ చెరకు విస్తీర్ణం 80వేల ఎకరాలు. పాత రకాల విత్తనాలనే రైతులు మళ్లీమళ్లీ వేయడం, భూమిలో సారం తగ్గడం తదితర కారణాలతో ఆశించనంతగా పంట దిగుబడి రావడం లేదు. పాత విత్తనాలు ఎక్కువగా చీడపీడలకు గురవుతున్నాయి. దీంతో అనకాపల్లి, కొండెంపూడి వ్యవసాయ పరిశోధన కేంద్రాలు చెరకులో కొత్త వంగడాలు, సాగులో కొత్త విధానాలను అందుబాటులోకి తెచ్చి, రైతులు ఆచరించే విధంగా విస్తృతంగా సదస్సులు నిర్వహిస్తున్నాయి.జిల్లాలో గోవాడ ఫ్యాక్టరీ మాత్రమే ఈ ఏడాది రెగ్యులర్ క్రషింగ్ చేసింది. ఈ ఫ్యాక్టరీ పరిధిలో సుమారు 30వేల ఎకరాల్లో చెరకు సాగు జరుగుతోంది. గతంలో ఒంటికన్ను ముచ్చుతో శ్రీసాగు విధానంలో అతి కొద్ది మంది మాత్రమే చెరకు సాగు చేసేవారు. గత నాలుగేళ్లుగా ఈ విధానాన్ని మరింత విస్తృతం చేసేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. 2024–25 క్రషింగ్ సీజన్‌కు 40 లక్షల ఒంటికన్ను ముచ్చు కొత్త వంగడాలను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంది. పలు ప్రాంతాల్లో నర్సరీలు పెంచి, అక్కడ నుంచి రైతులకు సరఫరా చేసేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం సిద్ధం చేసింది.

శ్రీసాగు విధానంపై ఆసక్తి

పాత పద్ధతిలో ఎకరాకు నాలుగు టన్నుల చెరకు విత్తనం అవసరవుతుంది. సాలుకు–సాలుకు మధ్య రెండు లేక రెండున్నర అడుగుల దూరంలో విత్తనం నాటుతారు. శ్రీసాగులో మాత్రం చెరకు కన్నులను మాత్రమే నాటుతారు. ఎకరాకు 6,500 మొక్కలు (కన్నులు) సరిపోతాయి. దీనివల్ల చెరకు తోటల్లో అంతర్‌పంటలు కూడా వేసుకుని ఆదాయం పొందవచ్చు. బోరులు ఉండి అవసరానికి తగ్గట్టుగా నీరు పెడితే సరిపోతుంది. శ్రీసాగు పద్ధతి వల్ల ఎకరాకు రూ.15వేలు వరకు పెట్టుబడి ఆదా అవుతుంది. సాధారణ పంట ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తే శ్రీసాగు వల్ల ఎకరాకు 40 టన్నులు పైబడి దిగుబడి సాధించవచ్చని చెరకు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

చెరకులో కొత్త వంగడాలు

చెరకులో 2009ఎ107, 87ఎ298, 2003వి46, 2006ఎ81, 2006ఎ252 అనే కొత్త రకాల వంగడాలను వేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. దీంతో ఈ రకాల్లోనే ఒంటికన్ను ముచ్చు విత్తనాన్ని గోవాడ ఫ్యాక్టరీ సిద్ధం చేస్తోంది. గోవాడ ఫ్యాక్టరీ పరిధిలో గజపతినగరం, గోవాడ , చినపాచిలి(రావికమతం), అంబేరుపురం, రోలుగుంట మండలంలో రెండు గ్రామాల్లో ఒంటికన్ను ముచ్చు విత్తనం తయారు చేసేందుకు నర్సరీలు నిర్వహిస్తున్నారు.

40 లక్షల మొక్కలు సరఫరా



శ్రీసాగుపై రైతులను చైతన్యపరచడంతోపాటు కొత్త రకం ఒంటికన్నుముచ్చు విత్తనాలు తయారు చేస్తున్నాం. ఈ ఏడాది 40 లక్షల ఒంటికన్ను ముచ్చు విత్తనాన్ని రైతులకు సరఫరా చేసేందుకు సిద్ధం చేశాం. ఒక మొక్క తయారీకి రూ.1.70 ఖర్చవుతుండగా ఫ్యాక్టరీ రాయితీగా 90 పైసలకు రైతులకు అందిస్తోంది.

– సన్యాసినాయుడు
గోవాడ సుగర్‌ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్

గంటా కుమారుడిపై కేసు నమోదు

- స్వీట్‌బాక్స్‌లపై టీడీపీ స్టిక్కర్లతో రంజాన్ కానుకలు
- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన కింద కేసు

మధురవాడ : భీమిలి నియోజకవర్గం మధురవాడలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలో భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ, పలువురు టీడీపీ నాయకులపై పీఎంపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. రంజాన్ సందర్భంగా గురువారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపే నెపంతో శివశక్తినగర్ రోడ్డులోని సద్గురు సాయి నాథకాలనీలోలో ఉన్న మసీద్–ఇ– ఫిర్దౌస్‌లో పార్టీ కండువాలు ధరించి భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ల ఫొటోలతో ఉన్న స్టిక్కర్లు అతికించి స్వీట్స్‌బాక్స్‌లు పంపిణీ చేశారు. వీటిని స్వయంగా గంటా కుమారుడు రవితేజ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై 'సాక్షి' దినపత్రికలో 'టీడీపీ బరితెగింపు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. భీమిలి హార్టికల్చర్ ఆఫీసర్, నియోజకవర్గం ఎంసీసీ టీమ్–4 ఇన్‌చార్జ్ ఆర్‌పీ స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పంపిణీ వ్యవహారంలో గంటా బావమరిది జీవన్ కుమార్‌తో పాటు మరికొంత మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, వీరు పేర్లు ఫొటోలు కూడా పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అయితే వారి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని విమర్శలు వస్తున్నాయి.



ముస్లిం పెద్దలను విచారిస్తున్న ఎన్నికల అధికారులు

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

అచ్యుతాపురం: వైఎస్సార్ సీపీలోకి ఇతర పార్టీల నుంచి వలసలు భారీగా పెరిగాయి. వైఎస్సార్ సీపీలో చేరేందుకు అచ్యుతాపురం మండలంలో క్యూ కడుతున్నారు. పూడి ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన 30 మంది కుటుంబాల వారు శుక్రవారం రాజాన సంజీవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు సమక్షంలో పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. లాలం హేమంత్ కుమార్, లాలం రంజిత్‌కుమార్, లాలం గంగాధర్, లాలం తాతాజీ, కోడూరు పవన్, కోడూరు రాహుల్, లాలం కిశోర్, లాలం నాని, కోడూరు శ్రీను, రాజాన మహేష్, గండి కాసుబాబు, గండి గోపి, అప్పారావు, రాజ్‌కుమార్, రమణ,శివాజీ తదితరులు పార్టీలో చేరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే అచ్యుతాపురానికి చెందిన కెజనాని, బి.అప్పలరాజు, తేజ, డి.రాము, డి.అప్పలరాజు, డి.అప్పారావు, వి.బాబూరావు, పి.నరసింహనాయుడు, పి.లక్ష్మణ్, కె.వెంకటేష్, గణేష్‌లకు ఎమ్మెల్యే కన్నబాబు రాజు,డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వెంకునాయుడు, పంచదార్ల రవి, పంచాదార్ల కృష్ణ, కిలాడ కృష్ణ, ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలోకి చేరిన పూడి ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన 30 కుటుంబాలతో కన్నబాబు,సుకుమార వర్మ

వైఎస్సార్‌సీపీలోకి చేరిన జన్నవరం ఉప సర్పంచ్

చోడవరం: వైఎస్సార్‌సీపీతోనే ఉంటానని జన్నవరం ఉప సర్పంచ్ గొలగాని శ్రీనివాసరావు తెలిపారు. ఆయనకు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ వైఎస్సార్‌సీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. జన్నవరం ఉప సర్పంచ్ శ్రీనివాసరావు ఇటీవల టీడీపీలోకి చేరారు. వైఎస్సార్‌సీపీలో ఉండే తాను స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిడితో ఆ పార్టీలోకి వెళ్లినట్టు తెలిపారు. అయితే వైఎస్సార్‌సీపీని వీడినందుకు చాలా మనస్తాపానికి గురయ్యాయన్నారు. అందుకే మళ్లీ నా సొంత పార్టీ అయిన వైఎస్సార్‌సీపీలోకి వచ్చానని చెప్పారు. ఎమ్మెల్యే ధర్మశ్రీ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తాను పూర్తిగా కృషిచేస్తానన్నారు. పార్టీలోకి వచ్చిన శ్రీనివాసరావును ఎమ్మెల్యే ధర్మశ్రీ స్వాగతించారు. టీడీపీ ప్రలోబాలకు ఎవరూ మోసపోవద్దని తెలిపారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నాతవరంలో టీడీపీకి షాక్

నర్సీపట్నం: నాతవరం మండలంలో టీడీపీ గట్టి షాక్ తగిలింది. మండలంలో ములగపూడి గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన పలు కుటుంబాల వారు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో గుర్తింపు లేదని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పనితీరు నచ్చి పార్టీలో చేరామని వారు తెలిపారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు.



వైఎస్సార్‌సీపీలోకి చేరిన జన్నవరం ఉప సర్పంచ్ శ్రీనివాసరావుకు పార్టీ కండువా వేసి స్వాగతిస్తున్న ధర్మశ్రీ

గ్రామ వలంటీర్ల రాజీనామాల పరంపర

గ్రామ వలంటీర్ల రాజీనామాల పరంపర కొనసాగుతోంది. టీడీపీ, జనసేన పార్టీ నేతలు చేస్తున్న అసత్య ఆరోపణలకు మనస్తాపం చెంది శుక్రవారం పలువురు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. యలమంచిలి, మునగపాక, అనకాపల్లి, పాయకరావుపేట మండలాల్లో వీరంతా స్వచ్ఛందంగా తమ బాధ్యతల నుంచి వైదొలిగారు. రాజీనామా పత్రాలను ఆయా ఎంపీడీవోలకు అందజేశారు.

- టీడీపీ, జనసేన నేతల అసత్య ఆరోపణలతో మనస్తాపం

యలమంచిలి రూరల్: పట్టణంతోపాటు మండలంలోని వార్డు/గ్రామ వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. యలమంచిలి పట్టణంలో 128 మంది వలంటీర్లు సంబంధిత సచివాలయ అడ్మిన్ల ద్వారా మున్సిపల్ కమిషనర్ కేపీ కొండలరావుకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. వీరి రాజీనామాలను ఆమోదిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 9 సచివాలయాల్లో రాజీనామా చేయగా, మిగిలిన నాలుగు సచివాలయాల వలంటీర్లు అదే బాట పట్టే అవకాశం ఉందని సమాచారం.

మండల పరిధిలో 125 మంది..

యలమంచిలి మండలంలోని పది సచివాలయాల పరిధిలో మొత్తం 152 మందికిగాను 125 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా పత్రాలను ఎంపీడీవో కె. అప్పలనాయుడుకు అందజేశారు. తామంతా స్వచ్ఛందంగా, సక్రమంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదల పవన్ కల్యాణ్ తరచుగా వలంటీర్ల వ్యవస్థను కించపరుస్తుండటంతో తీవ్ర మనస్తాపానికి గురై రాజీనామాలు చేస్తున్నట్టు వారు లేఖల్లో పేర్కొన్నారు. తమ రాజీనామాల వెనుక ఎవరి ఒత్తిడి లేదన్నారు. బయ్యవరం పంచాయతీలో 12 మంది, ఏటికొప్పాక-1లో 15 మంది, ఏటికొప్పాక-2లో 16, కృష్ణాపురంలో 14, లైనుకొత్తూరులో 8, పులపర్తిలో 13, పురుషోత్తపురంలో 17, రేగుపాలెంలో 9, షేక్విల్లపాలెంలో 14 మంది, పోతురెడ్డిపాలెంలో ఆరుగురు చొప్పున చేసిన రాజీనామాలను ఎంపీడీవో ఆమోదించారు.

పాయకరావుపేట మండలంలో 32 మంది

పాయకరావుపేట: మండలంలో పెంటకోట, రాజవరం గ్రామ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వీరందరూ వేర్వేరుగా రాజీనామా పత్రాలను ఎంపీడీవో కె.స్వప్నకు శుక్రవారం అందించారు. పెంటకోటకు చెందిన 20 మంది, రాజవరం గ్రామానికి చెందిన 12 మంది వలంటీర్ల రాజీనామా పత్రాలను అందించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ మే 13 న జరిగే సాధారణ ఎన్నికల్లో తామందరం వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై మరింతగా అవగాహన కల్పిస్తామన్నారు.

మునగపాకలో 163 మంది

మునగపాక: మాజీ సీఎం చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ నేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని 163 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామాలు చేశారు. వీటి పత్రాలను ఎంపీడీవో ఎం.మన్మథరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక చంద్రబాబు అండ్ కో తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. టి.సిరసపల్లి, తోటాడ, ఉమ్మలాడ తదితర పంచాయతీలకు సంబంధించిన వలంటీర్లు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

అనకాపల్లిలో 57 మంది...

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల, బవులవాడ, శంకరం, మారేడుపూడి గ్రామాలకు చెందిన 57 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వీటి పత్రాలను ఎంపీడీవో పీవీవీఎం మోహన్‌కుమార్‌కు శుక్రవారం వారు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీ నేతలు తమ సొంత పనులకు వెళ్లినా ఎన్నికల ప్రచారం చేస్తున్నట్టుగా తప్పుడు ఆరోపణలు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వలంటీర్ల రాజీనామాపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో తెలిపారు.



యలమంచిలి ఎంపీడీవో కార్యాలయానికి రాజీనామా చేయడానికొచ్చిన వలంటీర్లు



మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెం సచివాలయ అడ్మిన్‌కు రాజీనామా పత్రాలు అందజేసిన వలంటీర్లు



పాయకరావుపేట: రాజీనామా పత్రాలను సమర్పించిన రాజవరం, పెంటకోట గ్రామ వలంటీర్లు



మునగపాక ఎంపీడీవో మన్మథరావుకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న టి.సిరసపల్లి వలంటీర్లు



అనకాపల్లి: రాజీనామ పత్రాలను చూపిస్తున్న తుమ్మపాల వలంటీర్లు

పశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- చౌడువాడలో శిబిరాన్ని పరిశీలించిన విశాఖ డెయిరీ జీఎం ప్రసాద్

కె.కోటపాడు: వేసవిలో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాడి రైతులకు విశాఖ డెయిరీ జీఎం ఏవీవీఎస్ ప్రసాద్ సూచించారు. డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, పాల సంఘం అధ్యక్షుడు కోమార వెంకటరమణల ఆధ్వర్యంలో చౌడువాడలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డెయిరీ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జీఎం తెలిపారు. ఏజీఎం పాండ్యరాజన్, పశువైద్యాధికారి హరినారాయణ, వేతన కార్యదర్శి చిన్ని వెంకటనర్సింహమూర్తి పాల్గొన్నారు.



పశు వైద్య సేవలను పరిశీలిస్తున్న జీఎం ప్రసాద్

చంద్రబాబు చెబితేనే వచ్చా..

- సీఎం రమేష్

చీడికాడ: చంద్రబాబునాయుడు అనకాపల్లి వెళ్లమని కోరితేనే ఇక్కడ పోటీ చేస్తున్నానని ప్రతిపక్ష కూటమి తరపున అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. చీడికాడలో శుక్రవారం రాత్రి జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉత్తరాంధ్రకు పెద్దదిక్కుగా కింజరాపు ఎర్రన్నాయుడు ఉండేవారని, ఇప్పుడు తాను పెద్దదిక్కుగా మారుతానన్నారు.

నిన్ను నమ్మం బాబూ!

- రూ.10 వేల హామీపై వలంటీర్ల మండిపాటు

కోటవురట్ల/తుమ్మపాల/దేవరాపల్లి/బుచ్చెయ్యపేట: కూటమి అధికారంలోకి వస్తే తమకు రూ.10 వేల వేతనం ఇస్తామంటున్న చంద్రబాబు మాటల్ని నమ్మబోమని భీమిలికి చెందిన వలంటీర్లు అంటున్నారు. ఇప్పటి వరకు తమపై చంద్రబాబు, పవన్ పలు ఆరోపణలు చేశారని... ఇప్పుడు రూట్ మార్చి వైఎస్సార్‌సీపీ ఇచ్చిన మొత్తం కంటే ఎక్కువ ఇస్తామని మభ్యపెట్టడం చంద్రబాబు రెండు నాలుకల ధోరణికి నిదర్శనమన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏ మేరకు నెరవేర్చారో చెప్పాలంటూ దుయ్యబట్టారు. ఏరు దాటాక తెప్ప తగలేసే రకాలను నమ్మమని మరోసారి చెప్పారు. దూషించిన నోటితోనే వలంటీర్లను పొగుడుతుండడం చూస్తుంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నట్టే కదా అన్నారు. వలంటీర్లే కాకుండా రాష్ట్ర ప్రజలెవరూ చంద్రబాబు, పవన్ మాటలను విశ్వసించరన్నారు. ఇచ్చిన మాటలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటే వేదంగా ఓటర్లంతా ఆయనను మరోమారు ముఖ్యమంత్రిగా చూసేందుకు ఉవ్విళ్లూరుతున్నారన్నారు.

మీరొస్తే వలంటీర్లుగా జన్మభూమి కమిటీలే..



మొన్నటి వరకు చంద్రబాబు వలంటీర్లపై ఎన్నో నిందలు మోపి ఇపుడు ఇంత ప్రేమ ఎందుకు చూపిస్తున్నారో అర్థం చేసుకోలేని స్థితిలో లేం. జగనన్న ఆశయాలను నెరవేరుస్తూ ఇప్పటి వరకు సేవ చేసి ఎంతో సంతోషంగా గడిపాం. మేము డబ్బుకు ఆశపడి పనిచేయలేదు. పది మందికి సేవ చేస్తున్నామనే సంతోషంతో చేశాం. మిమ్మల్ని రానిస్తే నిజంగా వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చినా, మళ్లీ జన్మభూమి కమిటీలనే వేస్తారని తెలుసు. నీ బూటకపు మాటలను వినే పరిస్థితి లేదు. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా తీసుకొచ్చుకుంటాం. నిన్ను రానిస్తే అవ్వాతాతల పని అంతే సంగతి.

– **గడమాల జ్యోతి**, పూర్వ వలంటీరు, యండపల్లి, కోటవురట్ల మండలం

చంద్రబాబు దొంగ హామీలు నమ్మబోము...



మొన్నటి వరకు వలంటీర్లను నోటికొచ్చినట్లు తిట్టిన చంద్రబాబు అధికారంలోకి వస్తే మాకు నెలకు రూ.10 వేలు ఇస్తానంటే ఎలా నమ్మాలి. ఎందుకు నమ్మాలి. నిన్ను నమ్మి ఓట్లేసిన ప్రజలనే జన్మభూమి కమిటీలతో నానా ఇబ్బందులు పెట్టించావు. ఇప్పుడు మళ్లీ జన్మభూమి కమిటీలను తీసుకురావని గ్యారెంటీ ఏంటీ. ప్రజల నుంచి మమ్మల్ని దూరం చేయాలని చూస్తున్న నిన్ను నమ్మేది లేదు. జగనన్న అందించిన సంక్షేమాన్ని నా క్లస్టర్‌లో ప్రతి ఇంటికి నేనే అందించాను. ప్రజలు కూడా జగనన్నను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు.

– **పసుపులేటి చంద్రశేఖర్**, పూర్వ వలంటీర్, శంకరం గ్రామం, అనకాపల్లి మండలం

కపటప్రేమ ఒలకబోస్తున్నారు



వలంటీర్ల అంతు తేలుస్తాం, జైలుకు పంపిస్తామని హెచ్చరికలు చేసి, ఇప్పుడు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తానంటే చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితి లేదు. నిమ్మగడ్డతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి పింఛన్ల పంపిణీని అడ్డుకొని వారి ఉసురు పోసుకున్నారు. అవ్వాతాతల నుంచి వ్యతిరేకత రావడంతో వలంటీర్లపై కపట ప్రేమ ఒలక బోస్తున్నారు. నిస్వార్థంగా సేవలందించిన మా మనోభావాలు దెబ్బతీసేలా హింసించారు. మాకు సేవ చేసే భాగ్యం కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవడానికి క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేస్తాం.

– **కొప్పాక నాగేంద్ర**, మాజీ వలంటీర్, బోయిలకింతాడ, దేవరాపల్లి మండలం

నిన్ను ఎలా నమ్మాలి?



జగనన్న వలంటీర్ వ్యవస్థ తీసుకొస్తే ఎందుకన్నావు? చదువుకున్న వలంటీర్లు ఇంటింటికీ గోనె సంచులు మోస్తున్నారని ఎగతాళి చేశావు. వలంటీర్లకు రూ. 5 వేలు ఎందుకు ఇవ్వడం, వలంటీర్ వ్యవస్థ శుద్ధ దండగ అన్నావు. ఇప్పుడు అధికార దాహంతో రూ. 10 వేలు ఇస్తామంటే మేం ఎలా నమ్మాలి? గతంలో బాబు వస్తే జాబ్ వస్తుందని నమ్మించి మోసం చేశావు. గద్దె నెక్కిన ఐదేళ్లలో ఒక్క నెలయినా నిరుద్యోగ భృతి ఇచ్చారా? డ్వాక్రా, రైతు రుణమాఫీ చేశారా? ఇప్పుడు నీ మాటలు మేం నమ్మలేం చంద్రబాబూ..

– **భర్నికాన గంగరాజు**, గ్రామ వలంటీర్, నేతవానిపాలెం, బుచ్చెయ్యపేట మండలం

మానసిక క్షోభపెట్టిన చంద్రబాబు



వలంటీర్లను మానసికంగా క్షోభపెట్టి, ఉగ్రవాదులుగా విమర్శించిన చంద్రబాబు అధికార దాహంతో కపట ప్రేమ చూపిస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తానని, కూటమి అధికారంలోకి వస్తే రూ.10 వేలు వేతనం పెంచుతామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి, ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీలనే నియమించుకుంటారు. పాత వలంటీర్లను కొనసాగిస్తారని నమ్మకం లేదు. తిరిగి సీఎం జగనన్ననే గెలిపించుకుంటాం.

– **పీలా మహాలక్ష్మీనాయుడు**, మాజీ వలంటీరు, బి. సింగవరం, చీడికాడ మండలం

రూ.6 లక్షల ఆస్తి బుగ్గిపాలు



మంటల్లో కాలిపోయిన జీవాలు



ప్రమాద స్థలిలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

- జన్నవరం, జి.జగన్నాథపురం గ్రామాల్లో అగ్నిప్రమాదాలు
- పశువులు, గడ్డివాములు దగ్ధం

చోడవరం రూరల్: మండలంలోని జన్నవరం, జి.జగన్నాథపురం గ్రామాల్లో శుక్రవారం మిట్టమధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదాల్లో 22 మంది రైతులకు చెందిన ఆరు లక్ష రూపాయల ఆస్తి బుగ్గిపాలైంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే హుటాహుటిన అక్కడికి చేరుకున్న ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తం చేసి పెద్ద నష్టం వాటిల్లకుండా చేశారు. ముందుగా జి.జగన్నాథపురంలో ప్రమాద సమాచారం అందుకున్న చోడవరం ఫైర్ ఆఫీసర్ వి.రామస్వామి సిబ్బందితో అక్కడికి చేరుకుని పెద్ద నష్టం వాటిల్లకుండా చేశారు. బండారు సన్యాసిపాత్రుడు, వెంకట సత్యనారాయణ, పైడినాయుడు, రామారావు, రెడ్డి చిన్నమనాయుడు, పెంటకోట పరమేశ్వరరావులకు చెందిన గడ్డివాములు, పాకలు కాలిపోయాయి. ఇదే సమయంలో జన్నవరంలో తుల్లా వారి కళ్లాల వద్ద మరో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సమాచారం తెలుసుకున్న చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అనకాపల్లి ఫైర్ స్టేషన్ వారిని అప్రమత్తం చేశారు. చోడవరం అగ్నిమాపక కేంద్రం నుంచి అక్కడికి సమాచారం అందడంతో అనకాపల్లి ఫైర్ ఆఫీసర్ తమ సిబ్బందితో ప్రమాద స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఈ ప్రమాదంలో తుల్లా రాజబాబు, సురేష్, అప్పారావు, చిట్టిబాబు, బాబూరావు, దేముడు, సిమ్మన్న, అప్పలనాయుడు, నర్సమ్మ, అప్పలకొండ, రాజు, ఈశ్వరరావు, అక్కమ్మలతోపాటు పల్లా సూకరాజు, పత్రి నాగేష్‌లకు చెందిన 23 పశువుల పాకలు, 11 వరికుప్పలు, ఆరు గడ్డివాములు, 9 మేకలు కాలిపోగా 107 కోళ్లు మంటల్లో చిక్కుకున్నాయి. మరో 20కి పైగా గొర్రె, మేకలను మంటల నుంచి రక్షించారు. ఒక ఎలక్ట్రిక్ మోటార్, కరెంట్ మీటర్ కాలిపోగా, తుల్లా చిలుకమ్మకు చెందిన రెండు సోలార్ ప్యానళ్లు కాలి పాడయ్యాయి. జి.జగన్నాథపురంలో ప్రమాద నివారణ అనంతరం చోడవరం ఫైర్ సిబ్బంది జన్నవరానికి చేరుకుని అనకాపల్లి సిబ్బందితో కలసి పెద్ద నష్టం వాటిల్లకుండా చేయగలిగారు.



అగ్నికి ఆహుతైన పాకలు, గడ్డివాములు

లిక్కర్ స్కాంలో అయ్యన్నపాత్రుడే సూత్రధారి



పార్టీ కరపత్రం అందజేసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: చంద్రబాబు హయాంలో జరిగిన నారా వారి లిక్కర్ స్కాంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడే ప్రధాన సూత్రధారి అని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. మున్సిపాలిటీలోని ఎన్నికల ప్రచారంలో ఆయన అయ్యన్నపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. లిక్కర్ స్కాంలో కోట్ల రూపాయలు దోచుకుని విశాఖపట్నంలో వందల ఎకరాల్లో రిసార్ట్స్ నిర్మించారన్నారు. అయ్యన్నకు మేలు చేసేందుకు చంద్రబాబు అడ్డగోలుగా మద్యం పాలసీలో నిబంధనలు సడలించారన్నారు. అనకాపల్లి జిల్లా కస్నూరుపాలెంలో విశాఖ డిస్టలరీ పేరుతో లిక్కర్ కంపెనీ పెట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు లిక్కర్ స్కాంలో రూ.1,300 కోట్లు దోచుకోలేదా అంటూ ఎమ్మెల్యే నిప్పులు చెరిగారు. వందల ఎకరాలు, పెద్ద పెద్ద భవనాలు ఎలా వచ్చాయని నిలదీశారు.

800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



బెల్లం పులుపుతో ఎస్ఈబీ అధికారులు

నాతవరం: సారా తయారీ చేసేందుకు సిద్ధం 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని గొలుగొండ ఎస్ఈబీ ఎస్ఐ రహీం శుక్రవారం తెలిపారు. మండలంలో గిరిజన గ్రామాలైన సరుగుడు, రామన్నపాలెం, అచ్చంపేటలో సారా బట్టీలపై దాడులు చేశామన్నారు. ఈ దాడిలో సరుగుడులోని గెడ్డలో బెల్లం పులుపు ధ్వంసం చేశామన్నారు. తయారుదారులు పరారీ కావడంతో సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్లుప్తంగా

17న సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు

అనకాపల్లి : గవరపాలెం పెదరామస్వామి దేవస్థానంలో ఈనెల 17న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ప్రతినిధి కొణతాల సత్యనారాయణ అన్నారు. దేవస్థానం ఆవరణలో కల్యాణ మహోత్సవం గోడ పత్రికను ఆవిష్కరించారు. 15న సోమవారం ఉదయం 8.52 నిమిషాలకు కల్యాణరాటతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. 17న ఉదయం 11.52 నిమిషాములకు స్వామివారి కల్యాణం అనంతరం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయం సభ్యులు మళ్ల రాజు, కొణతాల అప్పలనాయుడు, కొణతాల గోపీకృష్ణ,కొణతాల శ్రీనివాసరావు, కర్రి అప్పాజీ, ఆలయ అర్చకులు అర్చకులు బిక్కవిల్లి నాగ సోమశేఖర శర్మ పాల్గొన్నారు.

14న లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 'హాస్యంతో అల్లరి'


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లాఫింగ్ క్లబ్, వాకర్స్ సభ్యులు

అనకాపల్లి : స్థానిక మెయిన్‌రోడ్డు వై.ఎం.వి.ఎ శ్రీధరాల వెంకటరమణ మెమోరియల్ హాల్లో ఈనెల 14న లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 'హాస్యంతో అల్లరి' కార్యక్రమం రాత్రి 7 గంటలకు నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు దాడి వాసు, కార్యదర్శి బొడ్డేడ మురళి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో హాస్యంతో అల్లరి కార్యక్రమం కరపత్రాలను క్లబ్ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాడి వాసు మాట్లాడుతూ ప్రతి నెలా రెండో ఆదివారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. క్లబ్ ఏర్పాటు చేసి పదేళ్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి వినకోట బుచ్చిరాజు, సభ్యులు, క్రీడామైదానం వాకర్స్ ఎం.రమణ, సాయి, నాయుడు, అజయ్, ప్రకాష్ పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

గొలుగొండ: మండలంలో అనంతసాగరం గ్రామ సమీపాన కొండ ప్రాంతాల్లో 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని ఎస్ఐ కృష్ణారావు శుక్రవారం తెలిపారు. ఇక్కడ సారా తయారీపై సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. సారా తయారీ, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 3,892 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,790	4,430
మొదటి రకం	3,570	4,370
రెండో రకం	3,460	3,150
మూడోరకం	3,250	3450

అనకాపల్లి సినిమాలు

లవ్‌గురు	: రాజా
శ్రీరంగ నీతులు	: సత్యనారాయణస్క్రీన్-1
ఐమాక్స్	: సత్యనారాయణస్క్రీన్-2
గీతాంజలి	: షిర్డిసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
మంజుమ్మెల్ బాయ్స్	: వెంకటేశ్వర
డియర్	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు,, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-14యూనిట్లు,, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 397మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

పేదల ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించండి


గొలగాం గ్రామంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్


మార్టూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి మలసాల నివేదిత


గోపాలపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

- జగనన్న పాలనతోనే గ్రామ స్వరాజ్యం
- ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ విస్తృత ప్రచారం

అనకాపల్లి : స్వాతంత్రం వచ్చిన తరువాత మన రాష్ట్రంలో నేటి వరకు పాలించిన ఏ ప్రభుత్వం గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజాన్ని అమలు చేయలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత మన అందరి పేదల ప్రభుత్వానిదే అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలో గొలగాం, బట్లపూడి, శంకరం గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కార్మికులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని ఆయన కోరారు. అర్హులైన లబ్ధిదారులందరికీ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి జరగకుండా డీబీటీ పద్ధతిలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. నాడు - నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకీకరించి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడమే కాకుండా సచివాలయాల పరిధిలో ఆర్‌బీకె, వెల్‌నెస్ సెంటర్, నూతన భవనాలను నిర్మించి ఆయా ప్రాంతాల్లో విశేష సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. గత పాలనలో గ్రామీణ ప్రజలు పట్టణ ప్రాంతంలో అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వచ్చేదని, జగనన్న పాలనలో గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ అధికారులు గ్రామాల్లోనే ప్రజలకు సేవలందించే విధంగా విప్లవాత్మక మార్పులు తేవడం జరిగిందని తెలిపారు. మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి బాటలో నడవాలంటే మరోసారి మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు పెదిశెట్టి గోవిందు, గొలగాం సర్పంచ్ సిహెచ్. నాగ నర్సింగరావు, గ్రామాల పార్టీ నాయకులు పసుపులేటి రామకృష్ణ, నింది అచ్యుత్, పిల్లల నాగేశ్వరారవు, బొడ్డేడ రామచంద్ర రావు, నొట్ల శ్రీనివసారావు, దొడ్డి నాగేశ్వరారవ, ముమ్మిన అప్పలనాయుడు పాల్గొన్నారు.

మార్టూరు, మారేడిపూడి గ్రామాల్లో.....

మే 13న జరిగే ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తెచ్చుకుని మరిన్ని సంక్షేమ పథకాలు మహిళలు అందుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, సతీమణి నివేదిత కోరారు. మండలంలో మారేడిపూడి, మార్టూరు గ్రామాల్లో ఉపాధి కార్మికులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళా పక్షపాతిగా జగనన్న పాలన సాగుతుందని, రాష్ట్రంలో మహిళలకు రాజకీయంగా అత్యధిక పదవులు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

బవుల వాడలో...

అనకాపల్లి : బలహీన వర్గాల రోగులకు వైద్యం నిమిత్తం ఆరోగ్యశ్రీ కార్డుతో కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం రూ.5లక్షలు కార్డును, రూ. 25 లక్షలకు పెంచి వైద్యం అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. బవులవాడ గ్రామంలో శుక్రవారం రాత్రి గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ప్రతి గడపకు వెళ్లి మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యేల గుర్తులయిన ఫ్యాన్ గర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. 81వ కార్పొరేటర్ పరిధిలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత వార్డు ఇన్‌ఛార్జి పీలా రాంబాబు ఆధ్వర్యంలో గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. మండలంలో గోపాలపురం గ్రామంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు.

ఉగ్గినపాలెంలో ఆరోగ్య సురక్ష


రోగులను పరీక్షిస్తున్న ఈఎన్‌టీ వైద్యురాలు జమిమా

కశింకోట: ఉగ్గినపాలెం గ్రామంలో వెల్‌నెస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 321 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 16 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలకు సిఫార్స్ చేశారు. ప్రత్యేక వైద్యాధికారులు జెమిమా జాబ్ (ఈఎన్‌టీ), జెమిమా(సైకాలజిస్టు), తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ హాజరై రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఆఫ్తాలమిక్ సంధ్య కంటి సమస్యలను గుర్తించి కళ్లద్దాలకు సిఫారసు చేశారు.

కోడ్‌కు అనుగుణంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

అనకాపల్లి : ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ఈనెల 14న అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల రేబాక మధుబాబు అన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ జి.శంకరరావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించాలని చెప్పారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


ఎం.చరణ్ (990/1000)


ఎ.మేఘనశర్మ (466/470)


సుంకర శ్రీసూర్యసాయి జాహ్నవి-(462/470)

తుమ్మపాల : శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు సీనియర్ ఇంటర్ ఫలితాలలో అద్భుతమైన ఫలితాలు సాధించారని ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. ఎం.చరణ్-990/1000, జి.రాజీప్రసన్న, ఎం.కుసుమప్రియ-988, ఈ.సరణ్య, జి.మానస, పి.లిఖిత్‌సంజీవ్ 985 మార్కులు, 22 మంది విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని, ఎ.మేఘనశర్మ-466/470, కె.వి.ఎల్.సంప్రీత్ -465, బి.భవానీ భాషిత -463, దాడి సునిత-463 మార్కులు సాధించడంపై ఎగ్జిక్యూటివ్ డీన్స్ కె.బంగారుబాబు, ఎస్.రఘుకుమార్, అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన బాలికలు


జి.చంద్రవేణి


ఎం.రూప


కె. రాజులమ్మ


బి. తేజశ్రీ

కశింకోట: మండలంలోని తేగాడ వద్ద ఉన్న ఏపీ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో బాలికలు మెరిశారు.రెండేళ్ల ఇంటర్మీడియట్‌లోనూ నాలుగు గ్రూపులోను బాలికలే ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో 85 శాతం, ద్వితీయ సంవ్సత్సరంలో 88 శాతం మంది వంతున ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ ఐ. మార్తా తిలకం శుక్రవారం తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 449 మార్కులతో కె.హనుష్క రత్నం, బైపీసీలో 422 మార్కులతో ఎస్.తేజశ్వని, ఎంఈసీలో 450 మార్కులతో వి.పూజిత, సీఈసీలో 431 మార్కులతో ఎస్.శ్రవంతి, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 931 మార్కులతో జె.చంద్రవేణి, బైపీసీలో 929 మార్కులతో ఎం.రూప, ఎంఈసీలో 868 మార్కులతో డి.కె. అఖిలేశ్వరి, సీఈసీలో 897 మార్కులతో వై.దేవి ప్రథమస్థానంలో నిలిచారన్నారు. వీరితోపాటు ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు.

కస్తూర్బాలో శతశాతం ఉత్తీర్ణత

మండలంలోని తేగాడలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరిశారు. మొదటి సంవత్సరం బైపీసీ గ్రూపు పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 54 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణులు కావడం విశేషం. ఒక్కసారిగా 44 శాతం ఉత్తీర్ణత పెరిగింది. మొత్తం 29 మంది విద్యార్థులు మొదటి ఏడాది పరీక్షలు రాయగా, వారంతా ఉత్తీర్ణులయ్యారు. కె. రాజులమ్మ 440 మార్కులకు 429 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. అలాగే ద్వితీయ సంవత్సరంలో కూడా ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఈ ఏడాది 22 మంది పరీక్షలు రాయగా, వారిలో 16 మంది ఉత్తీర్ణతతో 73 శాతం సాధించారు. బి. తేజశ్రీ వెయ్యికు 926 మార్కులు అత్యధికంగా సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. గత ఏడాది 60 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 73 శాతానికి పెరిగింది. ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన రాజులమ్మ, తేజశ్రీలతోపాటు ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డి. చంద్రకళ అభినందించారు.

పెరిగిన గురుకుల బాలికల ఉత్తీర్ణత

మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలలో 95.5 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం గత ఏడాది కంటె గణనీయంగా పెరిగింది. మొత్తం 66 మంది పరీక్షలు రాయగా, 63 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ జి. గ్రేస్ శుక్రవారం తెలిపారు. గత ఏడాది 61.64 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. బి. భవాని ఎంపీసీ గ్రూప్‌లో అత్యధికంగా 953 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఇక మొదటి సంవత్సరంలో 53 మంది పరీక్షలకు హాజరు కాగా, 49 మంది ఉత్తీర్ణులయ్యారని, 92.5 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇది గత ఏడాది 68.18 శాతమన్నారు. ఎంపీసీ గ్రూపులో కె.జాయ్‌సీ 454 మార్కులతో ఉత్తీర్ణులై ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అధిక మార్కులు సాధించిన బి. భవాని,కె. జాయ్‌సీలతో పాటు ఉత్తీర్ణులైన విద్యార్థినులకు ఆమె అభినందనలు తెలిపారు.


విశ్వభారతి జూనియర్ కళాశాల విద్యార్థులకు కరస్పాండెంట్ మళ్ల జగదీష్, ఉపాధ్యాయ బృందం అభినందన

ఫస్టియర్‌లోనూ ఉత్తమ ఫలితాలు

విశ్వ భారతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో జయభేరి మోగించారు. ఎంపీసీ గ్రూపులో ప్రథమ సంవత్సరానికి చెందిన షేక్ రిజ్వానా 470కి 463 మార్కులు సాధించిందని కరస్పాండెంట్ మళ్ల జగదీష్, ప్రిన్సిపాల్ జి.నానాజీ తెలిపారు. బైపీసీలో వి.జాహ్నవి 419 మార్కులు, సీఈసీలో ఎం. కుసుమ 467 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో టి.గాయత్రి 948, బైపీసీలో సిహెచ్. సౌమ్యశ్రీ 952 మార్కులు సాధించారన్నారు. వీరితోపాటు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను వారు, కళాశాల ఉపాధ్యాయ బృందం సభ్యులు శుక్రవారం అభినందించారు.

ప్రైవేటు కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు


కె.దిలీప్‌కుమార్, ఎంపీసీ (989)


ఉపాధ్యాయ ఒకేషనల్ విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

తుమ్మపాల : ఇంటర్ ఫలితాల్లో డాక్టర్ హిమశేఖర్ జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ కె.జనార్దన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కె.దిలీప్‌కుమార్ (హెచ్‌టి నెం.2406212004) 989/1000 మార్కులు సాధించారని తెలిపారు. మరికొంత మంది విద్యార్థులు పి.నిహారిక 984, పి.నిఖిల్ 983, కె.శ్రీనివాస్ 977, జి తేజస్విని 975, వి.వైష్ణవి 975, కె.దివ్యవాణి 967, కె.రూపేష్ 966, డి.శ్రీకరి 961 మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో యు.దేవిగాయత్రి 462/500, ఎస్.తరుణ్ 462, రోషిని 458, ఎం సునీత 457 వై.మోహిత 456, ఎన్.సాయిప్రవల్లిక 456, ఏ.లిఖిత 456 సాధించారని, మొదటి సంవత్సరం బైపీసీలో ఎ.పూజిత 465, కె.హేమలత 461 మార్కులు సాధించారని, సీఈసీలో వి.నందిని 477 మార్కులు సాధించినట్టు తెలిపారు. హిమశేఖర్ కాలేజీ ఐఐటీ క్యాంపస్‌లోని స్పెషల్ బ్యాచ్ విద్యార్థులందరూ అద్భుతమైన ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ పి.సురేష్ తెలిపారు.

నారాయణ...

నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని శ్రీసూర్యసాయి జాహ్నవి - 462/470, పూసర్ల లలితాదేవి-461, మచ్చర్ల హిందుశ్రీ 460 సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో సేనాపతి శిరీషా-981/1000, ఎంపీసీలో వెల్లంకి యామినీశ్రీ -971 మార్కులు సాధించారని తెలిపారు.

ఒకేషనల్ కళాశాలలో..

ఉపాధ్యాయ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఎం.జగన్‌మోహన్ తెలిపారు. ఒకేషనల్ రెండో సంవత్సరం ఫలితాల్లో పడాల ప్రసన్న -946/1000, ఎల్.యశోద -939, కె.భాగ్యసమితా -936, కెహెచ్‌జీ.వెన్నెల 926, డి.రేష్మ-921, ఎ.రేవతి-916, మొదటి సంవత్సరం ఫలితాలలో ఎస్.కె.కై రునిషా -472/500, కె.మౌనిక - 467 , పి.భవానీ-464 , వి.భార్గవి -459 , ఎ.కృపా, జి.వరప్రసన్న-449 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను అభినందించి స్వీట్లు పంచిపెట్టారు.

బాల్య వివాహాలు నివారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీవో శశికళ

కశింకోట : బాల్య వివాహాలు జరగకుండా నివారించడానికి ప్రజల్ని చైతన్యపరచాలని అసిస్టెంట్ సీడీపీవో శశికళ కోరారు. స్థానిక బాలికల హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిషేధ చట్టంపై మండల ఉపాధ్యాయులకు అవగాహన కలిగిస్తూ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భ్రూణ హత్యలు జరగకుండా చూడాలని, ఆడ పిల్లలని పలుచనగా చూడకుండా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కలిగించి చైతన్యపరచాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ప్రియ, సుచిత్ర పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మృతికి సంతాపం


బాబురావు (ఫైల్)

అనకాపల్లి : మాజీ ఎంపీపీ, జీవీఎంసీ విలీనగ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవాలయం వ్యవస్థాపకుడు కొణతాల బాబూరావు అనారోగ్య కారణంగా శుక్రవారం వారి స్వగృహంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా పలు రాజకీయ నాయకులు, వివిధ దేవాలయాల చైర్మన్లు బాబురావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు


అన్నవరం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్

కోటవురట్ల: ఎన్నికల ప్రచారాలు జోరందుకున్న వేళ ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరమయ్యాయి. ఎన్నికలలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా ఎన్నికల సంఘం పటిష్ఠ చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారాలు జరిగే గ్రామాలపై ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘా పెడుతోంది. ఆయా రహదారుల్లో వాహనాల తనిఖీ చేపడుతున్నారు. అన్నవరం రోడ్డులో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. వాహనాలు ఆపి డిక్కీలు, బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా నూకాంబిక ఆలయం


తిమ్మరాజుపేటలోని నూకాంబిక అమ్మవారి ఆలయం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో నిర్మిస్తున్న నూకాంబిక అమ్మవారి ఆలయం పనులు దాదాపు పూర్తికావచ్చాయి. ఈ నెల 26న ఆలయం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సమరసత సేవా ఫౌండేషన్, తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో తిమ్మరాజుపేటలో నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ప్రారంభోత్సవానికి సన్నాహాలు వేగవంతం చేస్తున్నామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

5 పంచాయతీల్లో వలంటీర్ల రాజీనామా

గొలుగొండ: కొంకసింగికి చెందిన గ్రామ వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. వీటి పత్రాలు శుక్రవారం వారు పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ కక్షగట్టి ప్రజలకు సేవలు అందించకుండా కోర్టుకు వెళ్లడం బాధకరమన్నారు. రాజీనామాలు చేసి ప్రజల్లోకి వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోసం పనిచేస్తామని తెలిపారు.

రోలుగుంట: మండలంలో కుసుర్లపూడి, రొంగలపాలెం పంచాయతీల నుంచి 17 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. వీటి పత్రాలను శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సుబ్బారావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని అడ్డుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చెడ్డపేరు తేవడానికి వలంటీర్ వ్యవస్థపై ఫిర్యాదు చేశారని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును విమర్శించారు.

నాతవరం: తమ రాజీనామాలతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మరింత మద్దతు పెరుగుతుందని వలంటీర్లు ధీమా వ్యక్తం చేశారు. మర్రిపాలెం, నాతవరం పంచాయతీల్లో 24 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. వీటి పత్రాలను ఎంపీడీవో జాగరపు రాంబాబుకు అందజేశారు. తమపై చంద్రబాబునాయుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

పది వరకే ఉపాధి పనులు


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం: వేసవి నేపథ్యంలో ఉదయం 10 గంటల వరకే ఉపాధి పనులు చేయించాలని ఎంపీడీవో జి.చంద్రరావు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జంగాలపల్లిలో ఉపాధి పనులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్ షీట్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎంత పనిచేస్తే గిట్టుబాటు కూలి వస్తుందో కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి


జల్లూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

కోటవురట్ల: విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించి ఉన్నతంగా ఎదగాలని డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు కోరారు. జల్లూరు జెడ్పీ హైస్కూల్‌ను ఆయన శుక్రవారం సందర్శించి విద్యా ర్థుల అభ్యసన సామర్థ్యాలు పరీక్షించారు. టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఎ ఫారెన్ లాంగ్వేజ్ (టీవోఈఎఫ్ఎల్) పరీక్షపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇంగ్లిష్ భాషపై ప్రతి విద్యార్థి పట్టు సాధించాలని సూచించారు. క్రమశిక్షణతో మెలగి లక్ష్యాలను సాధించాలన్నారు. హెచ్ఎం శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అధికలోడుతో వెళుతున్న వాహనాలపై కేసులు


నాగవరం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక : మండలంలోని నాగవరం హైవేలో శుక్రవారం సాయంత్రం ఎస్ఐ పి.ప్రసాదరావు వాహన తనిఖీలు నిర్వహించారు. అధికలోడుతో వెళుతున్న వాహనాలను గుర్తించి రూ.5,51,110 మేర జరిమానా విధించారు. పరిమితికి మించి వాహనాల రాకపోకలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాహన చోదకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

గొలుగొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని యలమంచిలి డివిజన్ డిప్యూటీ డీఈవో పి. అప్పారావు తెలిపారు. ఆయన శుక్రవారం ఏఎల్ పురం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఇక్కడ విద్యా విధానం, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సక్రమంగా విద్య, భోజనం అందే విధంగా స్కూల్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎం నాగభూషణం పాల్గొన్నారు.